# అధికార బలం వర్సెస్...జన బలం

● మునుగోడులో కొత్త రాజకీయ సమరం ● కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మళ్లీ కీ-ప్లేయర్ ● 2023 ఓటమి తర్వాత తగ్గని దూకుడు ● ప్రజల్లోనే మాజీ ఎమ్మెల్యే.. రైతు పోరాటాలతో పెరుగుతున్న గ్రాఫ్ ● అధికార ఎమ్మెల్యేకు పెరుగుతున్న రాజకీయ సవాల్?

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),ఆగస్టు10:** మునుగోడు నియోజకవర్గ రాజకీయాల్లో మళ్లీ ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. 2023 ఎన్నికల తర్వాత రాజకీయ సమీకరణాలు మారిపోయినా.. ప్రస్తుతం పరిస్థితులు మరోసారి కొత్త మలుపు తీసుకుంటున్నాయా? అనే చర్చ నియోజకవర్గంలో జోరందుకుంది. ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ ప్రజలకు దూరం కాకుండా.. నిరంతరం ప్రజల్లో తిరుగుతూ.. రైతు సమస్యలపై పోరాడుతూ.. స్థానిక సమస్యలను తన రాజకీయ అజెండాగా మలుచుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గ్రాఫ్ క్రమంగా పెరుగుతోందనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

**ఓటమి..కానీ రాజకీయంగా వెనక్కి తగ్గని అడుగు:**

2023 ఎన్నికల్లో ఎదురైన పరాజయం ప్రభాకర్ రెడ్డి రాజకీయ వేగాన్ని తగ్గించలేకపోయిందనే చర్చ మొదలైంది.ఎన్నికల తర్వాత కొంతకాలం ప్రజల్లో కనిపించకుండా ఉండే బదులు..ఆయన నియోజకవర్గంలోనే విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలతో మమేకమయ్యే ప్రయత్నం కొనసాగించారు.గ్రామానికి వెళ్లినప్పుడు పార్టీ కార్యకర్తలతోనే కాకుండా సామాన్య ప్రజలతో మాట్లాడటం, పేరుపెట్టి పలకరించడం, స్థానిక సమస్యలను తెలుసుకోవడం వంటి వ్యక్తిగత సంబంధాల రాజకీయమే ఇప్పుడు ఆయనకు బలంగా మారుతోందనే విశ్లేషణలు ఉన్నాయి.ఎన్నికలప్పుడు మాత్రమే కాదు..ఎన్నికలు లేనప్పుడు కూడా ప్రజల్లోనే అనే ఇమేజ్ క్రమంగా ఏర్పడటం ఆయనకు రాజకీయంగా మైలేజ్ ఇస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**రైతు సమస్యలపై పోరాటమే ప్రధాన ఆయుధం:**

మునుగోడు వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో రైతు సమస్యలు ఇక్కడ రాజకీయాలను ప్రభావితం చేసే ప్రధాన అంశాల్లో ఒకటి.ఈ నేపథ్యంలో రైతుల సమస్యలపై ప్రభాకర్ రెడ్డి తరచూ స్పందించడం, ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం ఆయనకు రైతు వర్గాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెడుతోందని ఆయన వర్గం చెబుతోంది.రైతుల సమస్యలు వచ్చినప్పుడు రాజకీయ ప్రకటనలకే పరిమితం కాకుండా.. ప్రత్యక్షంగా వారి వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకోవడం, ఆ సమస్యలను ప్రజా ఉద్యమాలుగా మలిచే ప్రయత్నం చేయడం ద్వారా తన రాజకీయ పోరాట శైలిని మరింత బలపరుస్తున్నారనే విశ్లేషణ ఉంది.

**చౌటుప్పల్‌పై ఫోకస్.. రాజకీయంగా పెద్ద ఎత్తుగడ?:**

మునుగోడు నియోజకవర్గంలో కీలకమైన చౌటుప్పల్‌పై మాజీ ఎమ్మెల్యే దృష్టి సారించడం ప్రస్తుతం రాజకీయంగా చర్చనీయాంశమైంది.100 పడకల ఆసుపత్రి, రోడ్ల విస్తరణ, ప్రజలకు సంబంధించిన మౌలిక వసతుల సమస్యలపై ఆయన నిరంతరం స్పందిస్తూ రావడం ద్వారా చౌటుప్పల్ ప్రజల్లో తన అనుబంధాన్ని బలోపేతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి.అదేవిధంగా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లో మాజీ మంత్రి హరీశ్ రావును తీసుకువచ్చి రైతులతో నేరుగా మాట్లాడించడం,రైతుల సమస్యలను అడిగి తెలుసుకోవడం కూడా రాజకీయంగా మైలేజీ తెచ్చిన అంశంగా మారింది.రైతుల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా..పార్టీ రాజకీయాలకు మించి రైతు సమస్యలపై పోరాడే నాయకుడిగా తనను తాను ప్రొజెక్ట్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

**ప్రతి మండలం..ప్రతి గ్రామం..వ్యక్తిగత పరిచయమే బలం:**

మునుగోడు నియోజకవర్గంలోని ప్రతి మండలం, ప్రతి గ్రామంలో వ్యక్తిగత పరిచయాలను కొనసాగించడం ప్రభాకర్ రెడ్డి రాజకీయ బలాల్లో మరో కీలక అంశంగా కనిపిస్తోంది.పార్టీలకు అతీతంగా ప్రజలను పేరుపెట్టి పిలవడం వారి కుటుంబాలను గుర్తుపెట్టుకోవడం.. గ్రామాల్లో స్థానిక సమస్యలను అడిగి తెలుసుకోవడం వంటి అంశాలు ఆయనకు వ్యక్తిగత ఓటు



బ్యాంకును నిర్మించడంలో ఉపయోగపడే అవకాశముందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.రాజకీయాల్లో పార్టీ గుర్తు ఒక బలం అయితే వ్యక్తిగత పరిచయం మరో బలం. ఎన్నికల సమయంలో ఈ రెండూ కలిసినప్పుడు ఫలితాలు ఎలా మారుతాయన్నదే ఇప్పుడు మునుగోడు రాజకీయాల్లో ఆసక్తికరమైన ప్రశ్నగా మారుతోంది.

**అధికార ఎమ్మెల్యేకు పెరుగుతున్న ఒత్తిడి?:**

మరోవైపు ప్రస్తుత ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నప్పటికీ.. ప్రజల మధ్య నిరంతరం కనిపించే విషయంలో మరింత చురుకుగా ఉండాల్సిన అవసరం ఉందనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.ఒకవైపు అధికారంలో ఉన్న ఎమ్మెల్యేకు ప్రభుత్వ యంత్రాంగం, అభివృద్ధి కార్యక్రమాలు బలంగా ఉంటే..మరోవైపు ప్రతిపక్ష నాయకుడికి ప్రజా సమస్యలపై పోరాటం, ప్రజల్లో నిరంతర పర్యటనలు రాజకీయ ఆయుధాలుగా మారుతున్నాయి.

**మంత్రి పీఠంపైనే ధ్యాస.. రాజగోపాల్‌రెడ్డికి పొలిటికల్ రిస్క్?**

ప్రజల సమస్యల పరిష్కారం, నియోజకవర్గంలో విస్తృత పర్యటనల కంటే మంత్రి పదవి సాధించడంపైనే ఎక్కువ దృష్టి పెట్టారనే విమర్శలు ప్రస్తుత ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై వినిపిస్తున్నాయి.ఇదే సమయంలో అధికారంలో లేకపోయినా కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ప్రజల్లో తిరుగుతూ, రైతు సమస్యలపై పోరాడటం ఆయనకు రాజకీయంగా కలిసొస్తోందనే చర్చ సాగుతోంది. ఒకరు పదవి కోసం.. మరొకరు ప్రజల కోసం అన్న రాజకీయ నినాదం మునుగోడులో బలపడితే.. దాని ప్రభావం రాబోయే రాజకీయ సమీకరణాలపై పడే అవకాశం ఉంది.ఇదే పరిస్థితి కొనసాగితే..రాబోయే రోజుల్లో మునుగోడులో అధికార బలం వర్సెస్ ప్రజల్లో ఉండే బలం అనే కొత్త రాజకీయ పోటీ రూపుదిద్దుకునే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు.

**మునుగోడులో 'సైలెంట్ షిఫ్ట్' మొదలైందా?:**

ప్రస్తుతం కనిపిస్తున్న పరిణామాలను బట్టి మునుగోడులో ఒక సైలెంట్ పొలిటికల్ షిఫ్ట్ మొదలైందా? అనే ప్రశ్న కూడా వినిపిస్తోంది.అయితే ప్రజల్లో కనిపిస్తున్న స్పందనను నేరుగా ఎన్నికల ఫలితాలతో సమానం చేయడం మాత్రం ఇప్పుడే సాధ్యం కాదు.ఎన్నికలకు ఇంకా సమయం ఉంది. అప్పటివరకు రాజకీయ పరిస్థితులు ఎన్నోసార్లు మారే అవకాశం ఉంది.కానీ ప్రస్తుత పరిస్థితిని గమనిస్తే.. కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి రాజకీయంగా ఖాళీ కాలేదు. పైగా ఓటమి తర్వాత ప్రజల్లో మరింతగా కనిపించేందుకు ప్రయత్నించడం ఆయనకు కొత్త బలం తీసుకొచ్చినట్లు కనిపిస్తోంది.

**ఇక ముందు అసలు పోరు ఎక్కడ?:**

మునుగోడులో వచ్చే రాజకీయ పోరు కేవలం పార్టీ గుర్తుల మధ్యే ఉండకపోవచ్చు.ఎవరు ప్రజల్లో ఎక్కువగా ఉంటారు?ఎవరు రైతుల సమస్యలను బలంగా వినిపిస్తారు?ఎవరు గ్రామస్థాయిలో వ్యక్తిగత సంబంధాలను బలోపేతం చేసుకుంటారు? ఎవరు చౌటుప్పల్‌తో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బలమైన క్యాడర్‌ను నిర్మిస్తారు?ఈ ప్రశ్నలే భవిష్యత్ మునుగోడు రాజకీయాన్ని నిర్ణయించే అవకాశముంది.

**చివరికి.. ప్రజల తీర్పే ఫైనల్:**

రాజకీయాల్లో గ్రాఫ్ పెరగడం ఒక విషయం.. దాన్ని ఎన్నికల విజయంగా మలచుకోవడం మరో విషయం. కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ప్రస్తుతం పెంచుకుంటున్న ప్రజా సంబంధాలు, రైతు సమస్యలపై పోరాటాలు, గ్రామస్థాయి పర్యటనలు రాబోయే రోజుల్లో ఏ స్థాయిలో రాజకీయ ప్రభావాన్ని చూపుతాయన్నది ఆసక్తికరంగా మారింది.2023లో ఓటమి.. 2026లో పెరుగుతున్న రాజకీయ చర్చ.. మరి రేపటి మునుగోడు ఎటు? ప్రజల్లో కొనసాగుతున్న కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి దూకుడు ఒకవైపు.. అధికారంలో ఉన్న రాజగోపాల్ రెడ్డి రాజకీయ వ్యూహం మరోవైపు.. మునుగోడు రాజకీయ చదరంగంలో అసలు చెక్ ఎవరిది? చెక్‌మేట్ ఎవరిది? అనేది రాబోయే కాలమే తేల్చనుంది.

# కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలి


● క్విట్ ఇండియా స్ఫూర్తితో జైల్‌భరో.. ఎండి జహంగీర్

**తొలి అక్షరం/చౌటుప్పల్: ఆగస్టు 10:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా, కార్మికులు, రైతులు, ప్రజలకు వ్యతిరేకంగా విధానాలను అమలు చేస్తోందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి జహంగీర్ ఆరోపించారు. కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ చౌటుప్పల్‌లో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకు చర్యలు చేపట్టడం ద్వారా కార్మికులు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను హరించే ప్రయత్నం చేస్తోందని అన్నారు. పని




గంటలను పెంచేందుకు యాజమాన్యాలకు అవకాశం కల్పించడం, సామాజిక భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల విషయంలో కార్మికుల హక్కులను బలహీనపరచడం సరికాదన్నారు.భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, రవాణా, బీడీ తదితర అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను పూర్తిగా ఉపసంహరించుకునే వరకు కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్‌లో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో ర్యాలీ నిర్వహించి ధర్నాలో పాల్గొన్నారు.కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎండి పాషా, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు, కార్మిక సంఘాల నాయకులు చీక అలివేలు, గోశిక కరుణాకర్, చీర్క సంజీవరెడ్డి, ఆదిమూల నందీశ్వర్, చీమకళ్ల శ్రీరాములు, జొన్నకంటి దేవయ్య, చింతల సుదర్శన్, ఆకుల ధర్మయ్య, బాతురాజు దశరథ, యాట బాలరాజు, కొంతం శ్రీనివాస్‌రెడ్డి, చెరుకు లక్ష్మమ్మ, జక్కిడి అంజిరెడ్డి, యాట వెంకటేశం, తూర్పునూరు మల్లేశం, కొండ శ్రీశైలం, మీసాల శ్రీను, యాదయ్య, మల్లమ్మ, జ్యోతి, నరసింహ, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, మాంద్ర కోటయ్య పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో ఘనంగా "సాహితి మణిపూసలు" పుస్తకావిష్కరణ





**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు10:** కవి, రచయిత కోట్ల దయానందం రచించిన "సాహితి మణిపూసలు" పుస్తకావిష్కరణ కార్యక్రమం షాద్‌నగర్ పెన్షనర్ భవన్‌లో ఘనంగా జరిగింది. సాహితి కళాభారతి, అనంత సాహిత్య సాంస్కృతిక వేదికల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు, కవులు, ఉపాధ్యాయులు, సాహితీప్రియులు పాల్గొన్నారు. శతావధాని ఐతగోని వెంకటేశ్వర్లు, ఆవిష్కర్త వెల్దండ రామారావు, వడిచర్ల సత్యం తదితరులు మణిపూసల సాహిత్య ప్రక్రియ ప్రత్యేకతను వివరించారు. తెలుగు ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి గ్రంథాన్ని సమీక్షించారు. "తెలంగాణ లోకల్ గైడ్" తెలుగు దినపత్రిక ఎడిటర్ చిలుకమర్రి రామిరెడ్డి తనకు తెలుగు భాషపై ఆసక్తి కలిగేలా ప్రోత్సహించిన గురువు కోట్ల దయానందంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ సుధీర్, మాజీ కౌన్సిలర్ వెంకట్రామిరెడ్డి, కవులు, రచయితలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


# పట్టుదల, క్రమశిక్షణతో కష్టపడి చదివితే, ఉన్నత స్థాయిని అధిరోధించవచ్చు

**మామిళ్లగూడెం నుంచి ఐసీఐసీఐ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్‌గా అర్వపల్లి అఖిల నాగ రమ్య**

**చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో చదువుతూ.. ఉన్నత స్థాయికి ఎదిగిన యువతి**

**పిల్లలు పుట్టినప్పుడు కాదు వారు భవిష్యత్తులో అభివృద్ధిలోకి వచ్చినప్పుడే నిజమైన ఆనందం అని నిరూపించిన అర్వపల్లి నగేష్-శ్రీలక్ష్మి**

**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10:** మామిళ్లగూడెం లో నివాసం ఉండే మధ్యతరగతి కుటుంబానికి చెందిన అర్వపల్లి నగేష్- ల కుమార్తె అఖిల నాగరమ్య, చిన్ననాటి నుండే చదువులో ముందుండి,ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పట్టుదలతో, ఉన్నత చదువులు చదివి నేడు దేశంలోనే ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన ఐసీఐసీఐ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించే స్థాయికి ఎదిగారు. కష్టపడి చదివి, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆమె విద్యా ప్రస్థానం నిరూపిస్తోంది. ఎన్ని కష్టాలు ఎదురైనా తన కుమార్తె భవిష్యత్తు బాగుండాలని, ఆర్థికంగా ఎన్నో సమస్యలు తలెత్తిన, కుమార్తెను వెన్ను తట్టి ప్రోత్సహించడంలో తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించారు తద్వారా అఖిల నాగ రమ్య 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మామిళ్లగూడెంలోని మాంటిస్సోరి ప్రైవేట్ స్కూల్‌లో విద్యనభ్యసించారు. అనంతరం ఇంటర్ విద్యను సాహితి జూనియర్ కాలేజీలో పూర్తిచేశారు. ఉన్నత విద్యలో భాగంగా గుంటూరులోని మాస్టర్ మైండ్స్ కాలేజీలో తన చదువును కొనసాగించారు.విద్యార్థి దశ నుంచే పట్టుదల, క్రమశిక్షణతో చదువుతూ తన లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేసిన అఖిల నాగ రమ్య, తాజాగా ఐసీఐసీఐ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించటం, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు, ఆమెను చదివించిన




ఉపాధ్యాయుల్లో ఆనందాన్ని నింపింది."విద్యకు కృషి తోడైతే విజయానికి హద్దులు ఉండవు" అన్నట్లుగా అఖిల నాగ రమ్య సాధించిన ఈ విజయాన్ని పలువురు అభినందిస్తున్నారు. ఆమె మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, తల్లిదండ్రులకు, చదివిన పాఠశాలకళాశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారు.**తల్లిదండ్రుల ఆనందం** కూతురు చిన్ననాటి నుంచి కష్టపడి చదువుకుని ఉన్నత ఉద్యోగాన్ని సాధించడం పట్ల తల్లిదండ్రులు నగేష్, శ్రీలక్ష్మి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అఖిల నాగ రమ్య భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.మామిళ్లగూడెం నుంచి ప్రారంభమైన అఖిల నాగ రమ్య విద్యా ప్రయాణం.. ఐసీఐసీఐ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ స్థాయికి చేరుకోవడం నేటి యువతకు స్ఫూర్తిదాయకం.

# డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

**- తంగడపల్లిలో యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమం**



**తొలి అక్షరం/చౌటుప్పల్, ఆగస్టు 10:** డ్రగ్స్, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మథ కుమార్ సూచించారు. సోమవారం తంగడపల్లి గ్రామంలో చౌటుప్పల్ పోలీసుల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్, ఎస్ఐ కె. యాదగిరితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొని ప్రజలకు డ్రగ్స్, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగం యువత ఆరోగ్యంతో పాటు వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు.యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పాటించాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, మత్తు పదార్థాల వినియోగం లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా పోలీసులు పిలుపునిచ్చారు.

